క్లుప్తంగా

టీటీడీ ఈఓను కలిసిన జిల్లా ఎస్పీ



తిరుమల: టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్‌ను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తమ వంతు కృషి చేయాలని ఈఓ ఎస్పీని కోరారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పాకాల: స్థానిక పీహెచ్‌సీ, దామలచెరువులో సచివాలయం–1లో సోమవారం స్విమ్స్ వైద్య బృందం నిర్వహించిన ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు మంచి స్పందన లభించింది. తొలుత వైద్యాధికారులు డాక్టర్ బాబు అలెగ్జాండర్, డాక్టర్ రవిరామ్ క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం బీపీ, మధుమేహం పరీక్షలతో పాటు పింక్ బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడిసిన్ విభాగాధిపతి కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు టీవీడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్, డాక్టర్ అరవింద్‌కుమార్, డాక్టర్ లక్ష్మీ పూజిత, స్విమ్స్ మెడికలాఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, ఎంపీహెచ్‌ఈఓ వాట్కిన్స్, ఎంపీహెచ్‌ఎస్‌లు వెంకట్రమణ, చిట్టెమ్మ, అంజలీదేవి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తమిచ్చి..ప్రాణం పోసి..!



రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

తిరుపతి తుడా: న్యూరో సంబంధిత వ్యాధితో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కడపజిల్లా చక్రాయపేటకు చెందిన ఈశ్వరమ్మకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బీ. ఓబుల్ రెడ్డి స్పందించారు. ఆయన విజ్ఞప్తితో ఆ విభాగం నాయకులు దాదాపు పదిమంది రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారిలో బద్రీనాద్, పూర్ణ, జగదీష్ తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం

తిరుపతి తుడా: తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని, తమ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం చేస్తామని సోమవారం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ అమరయ్యకు సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరణ, సర్వే ఇత్యాది వాటికి ఇంటింటికీ వెళ్లి అవమానానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు.

వృక్ష సంహారం!



నరికివేత ముందు ఇలా..



నరికివేత తరువాత ఇలా..

తిరుపతి తుడా: తిరుమల బైపాస్ రోడ్డు అలిపిరి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ హోటల్ ఎదురుగా రెండు భారీ చెట్లను నరికేశారు. తాము నూతనంగా నిర్మించిన లాడ్జీలకు చెట్లు అడ్డుగా ఉన్నాయని భావించిన యజమానులు చెట్లను గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి నరికేశారు. వాస్తవానికి ఈ చెట్ల మాటున నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేశారు. భవనానికి రంగులు వేశాక ఇక చెట్లతో పని లేదని నరికేశారు. చెట్లు నరికే సమయంలో సాక్షి కెమెరాకు కంటబడడంతో ఒక కొమ్మను వదిలి పెట్టారు. తిరుమల బైపాస్ రోడ్డు, కపిలతీర్థం–అలిపిరి మార్గాల్లో పలువురు తమ భవనాలకు అడ్డుగా ఉన్నాయని పలు చెట్లను నరికేస్తూ, పచ్చదనాన్ని హరిస్తున్నారు. అలాంటి వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

మోక్షగుండం సేవలు చిరస్మరణీయం





మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీడీసీఎల్ చైర్మన్, అధికారులు , సమావేశంలో మాట్లాడుతున్న టేప్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి

తిరుపతి రూరల్: దేశానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు శ్లాఘనీయమని ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు స్మరించారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని తన కార్యాలయంలో సంతోష రావు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఇంజినీరుగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎన్నో డ్యాములు, కట్టడాలు నిర్మించి, ఇంజినీరింగ్ నైపుణ్యంలో తన విలక్షణతను చాటి, ఇంజినీర్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్డి) ఎస్.శోభా వాలెంటీనా, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, కృష్ణారెడ్డి, రమేష్, ప్రసాద్, సురేంద్రరావు, మురళీ కుమార్, వెంకటరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీర్లకు మోక్షగుండం స్ఫూర్తిదాయకం

తిరుపతి కల్చరల్: దేశంలో తొలి ఇంజనీర్‌గా ఖ్యాతి గడించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కీర్తించారు. సోమవారం మోక్షగుండం జయంతిని గంధమనేని శివయ్య భవన్‌లో అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్ (టేప్) ఘనంగా నిర్వహించారు. ఏపీ వన్నెకుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్.రాజన్, తుడా సీపీఓ దేవి కుమారి, మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ మహబూబ్‌ఖాన్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, 'టేప్' అధ్యక్షుడు ఎం.ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. మోక్షగుండంను ఆదర్శంగా తీసుకుని నిర్మాణ రంగంలో ఇంజినీర్లు అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 10 మంది టాపర్లకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేశారు.. టేప్ సీనియర్ ఇంజినీర్ డాక్టర్ ఎస్.విజయభాస్కర్‌ను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మునికృష్ణ, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్, ఏసీపీలు మూర్తి, మధుసూదన్, టేప్ చైర్మన్ టి.వెంకటేష్‌బాబు, వ్యవస్థాపక అధ్యక్షుడు టి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బుసా షణ్ముగం, ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు, ఏ.సుధాకర్‌రెడ్డి, కోశాధికారి డి.సందీప్, సహాయ కార్యదర్శులు శివశంకర్‌రెడ్డి ,ఎం.బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్, వెల్ఫేర్ కార్యదర్శి డి.సురేష్, సభ్యులు, భారతీ సిమెంట్, ఇతర సిమెంట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతిలో..

తిరుపతి గాంధీ రోడ్డు: ఇంజినీర్స్ డే పురస్కరించుకుని తిరుపతిలో బీజేపీ నాయకులు, ఇంజినీర్లు కలసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, కట్టమంచి చంద్రబాబు, యాదవ్ సుబ్రహ్మణ్యం, ఏ-వన్ మస్తాన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్, జీఎస్.ప్రసాద్, జయలక్ష్మి, విశ్రాంత ఎస్వీడబ్ల్యూ కాలేజి ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: జీవకోనకు చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కిరణ్ ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఇది తెలుసుకున్న తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు సోమవారం పాకాల మండలంలోని కిరణ్ స్వగ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. కిరణ్ మృతి ఎంతో కలచివేస్తోందని అభినయ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 12వ డివిజన్ కెనడీ నగర్‌లోని సూర్యనారాయణరెడ్డి తల్లి లక్ష్మమ్మ సోమవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి వారి నివాసానికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. తన స్నేహితుడి తల్లి మరణం తనను బాధకు గురిచేసిందని భూమన ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం 69వ స్కూల్ గేమ్స్ మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. వాలీబాల్ అండర్–14 బాలికల విభాగంలో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్, ఎంజీఎం హైస్కూల్, బాలుర విభాగంలో మాలవ్యాజి మున్సిపల్ హైస్కూల్, ఎస్వీ క్యాంపస్ హైస్కూల్, వాలీబాల్ అండర్–17 బాలికల విభాగంలో ఎస్వీ క్యాంపస్ స్కూల్, ఎస్పీజేఎన్ఎం హైసూల్, అండర్–17బాలుర విభాగంలో నారాయణ పాఠశాల, ఎస్పీజేఎన్ఎం హైస్కూల్ జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. ఇక, కబడ్డీ అండర్–14బాలికల విభాగంలో ఎంజీఎం హైస్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాల, అండర్–14బాలుర విభాగంలో ఎస్పీజేఎన్ఎం హైస్కూల్, శ్రీవారు హైస్కూల్ జట్లు, అండర్–17బాలికల విభాగంలో ఎంజీఎం హైస్కూల్, నారాయణ స్కూల్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లు డివిజన్ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటాయి. విజేతలను ఎంజీఎం హైస్కూల్ హెచ్ఎం టి.పరంధామనాయుడు, డీఎస్‌డీఓ శశిధర్, ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ విద్యాలత, వ్యాయామోపాధ్యాయులు పి.విజయకుమారి, ఎం.హేమంత్‌కుమార్, పి.మునయ్య, ఎం.ప్రసన్నలక్ష్మి, రాజనరసింహ, సుధా, మణికంఠ, ఉపాధ్యాయులు, అర్బన్ మండలంలోని జెడ్పీ, మున్సిపల్, ప్రైవేటు స్కూళ్ల క్రీడాకారులు పాల్గొన్నారు.



పాకాల: విద్యార్థులతో వాలీబాల్ ఆడుతున్న ఎంఈఓలు

క్రీడలతో ఉల్లాసం

పాకాల: విద్యార్థుల్లో మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంఈఓ బాబ్జి, ఎంఈఓ-2 లింగయ్య తెలిపారు. సోమవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సుమతమ్మ ఆధ్వర్యంలో మండల గ్రామీణ పోటీలను ప్రారంభించి వారు మాట్లాడారు. క్రీడలతో శరీక ఆకృతి చక్కగా ఉంటుందన్నారు. ఆటల పోటీలకు రూ.10,000 విలువ చేసే షీల్డ్స్, మెడల్స్‌ను పత్తిపాటివారిపల్లె దగ్గర ఉన్న మహాప్రస్థాన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ ఇవ్వడం ఆనందాయకమని కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో ఆర్థిక స్వావలంబన

రామచంద్రాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ(వెలుగు ప్రాజెక్టు) పీడీ శోభన్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని సీ.రామాపురం గ్రామ సమైఖ్య డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా నిర్వహించిన గ్రామసభలో పీడీ మాట్లాడారు. పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ రుణాలను ప్రతి మహిళ 35 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. మహిళా సంఘాల సభ్యులు జీవనోపాధి కోసం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలు చేయడానికి పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు.ఇన్సూరెన్స్, పశువుల నాణ్యత, పాల ఉత్పత్తి కోసం పాటించవలసిన మెళకువలు వెటర్నరీ డాక్టర్ జయ కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, సీసీ సుధాకర్, వీఓ వాణి, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టీటీడీకి రూ.20 లక్షల విరాళం



విరాళం డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

తిరుమల: శ్రీవారి భక్తుడు మంగళగిరికి చెందిన మన్యం శ్రీనివాసరావు సోమవారం తన కుమార్తె మన్యం హారిక పేరు మీదుగా టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,00,116, మరో కుమార్తె మన్యం హరిత పేరు మీదుగా ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జానకిదేవి పాల్గొన్నారు.



టీటీడీకి వాహనాన్ని అందజేస్తున్న దాతలు

ఎలక్ట్రిక్ వాహనం విరాళం

బెంగళూరుకు చెందిన టివోల్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15,94,962 విలువైన మొంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్ (ఈ-ఎస్‌సివి) వాహనాన్ని సోమవారం టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ముందు వాహనానికి పూజలు చేసి తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 77,893 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,604 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.53 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

తిరుపతి కల్చరల్: టీటీడీలో 15 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాంగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి.మునీంద్రనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీలో వివిధ శాఖలలో ఉద్యోగాల విరమణ అనంతరం సుమారు 40 శాతం ఉద్యోగాలున్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీపై మంగళవారం టీడీడీ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే టీటీడీ విద్యాసంస్థలు, హాస్టళ్లలో సీట్లు పెంచాలని కోరారు. సభ్యురాలు సరస్వతమ్మ మాట్లాడుతూ, తిరుపతి కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలని కోరారు.

డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా గంగరాజు



గంగరాజు

చంద్రగిరి: శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలకు అసోసియేట్ డీన్‌గా ప్రొఫెసర్ జి. గంగరాజు నియమితులయ్యారు. సోమవారం ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాయలసీమ అధ్యక్షుడు ఉత్తరాది విజయ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వెంకట్ యాదవ్, యూనివర్సిటీ అధ్యక్షుడు దాన్ ఏజ్రా, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సురేష్, ముస్తఫా, గిరి, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ బహిష్కరిస్తా మనడం విడ్డూరం

తిరుపతి కల్చరల్: కురుబ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్ కుల సంక్షేమానికి చేసిందేమీ లేదని, ఆయన తిరుపతిలో అక్టోబర్ 5న కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని జిల్లా కురువ, కురుబ సంఘం గౌరవాధ్యక్షుడు పోతప్ప, అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి సవితమ్మ తిరుమల కొండపై కనకదాసు పీఠం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారని ఆమెపై శ్రీనివాస్ వ్యక్తిగత దూషణకు పాల్పడడం శోచనీయమని ఖండించారు. కురువ, కురుబ సంఘం నేతలు రామాంజనేయులు, నంజుండప్ప, వెంకటప్ప, మల్లయ్య, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

రేపు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

తిరుపతి కల్చరల్: గాలివీధిలోని శ్రీకాళికా పరమేశ్వరి ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి భగవాన్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.కార్తీక్ ఆచారి, ఎం.శివా ఆచారి తెలిపారు.

నోటీస్ బోర్డు

- పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు పార్టీ మైనారిటీ విభాగం నేతల సమావేశం.
- యూత్ హాస్టల్‌లో ఉదయం 10.30 గంటలకు 'భారత రాజ్యాంగం–దళితులు, ఆదివాసీలు' అనే అంశంపై సదస్సు.
- తిరుమల అన్నమయ్య భవన్‌లో ఉదయం మధ్యాహ్నం 12 గంటలకు టీటీడీ పాలక మండలి సమావేశం.
- మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటలకు ధ్యాన మహా యజ్ఞం ప్రారంభం.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమన్వయ సమావేశం

తిరుమల: ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ అంశాలపై సోమవారం టీటీడీ అదనపు ఈఓ సీహెచ్. వెంకయ్య చౌదరి స్థానిక అన్నమయ్య భవన్‌లో తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతో కలిసి టీటీడీ విజిలెన్స్, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం అదనపు ఈఓ మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆర్టీసీ సర్వీసులు రోజూ 435 బస్సులు నడుస్తున్నాయని, వీటి ద్వారా రోజూ సుమారు 1.60 లక్షల మంది భక్తులకు రాకపోకలకు వీలవుతుందన్నారు. తిరుపతిలోని 23 ప్రదేశాలను వాహనాల పార్కింగ్ కోసం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల నుంచి 2 లక్షల వరకు భక్తులు కూర్చుని వాహన సేవలను తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 4200 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, అదనపుఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తిరుమలలో తనిఖీలు చేస్తున్న టీటీడీ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్, జిల్లా ఎస్పీ

విజిలెన్స్, పోలీస్ తనిఖీలు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుమలలోని పలు ప్రాంతాలలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై చర్చించారు.

బ్రహ్మోత్సవ బస్సుల తనిఖీ

తిరుపతి అర్బన్: ఈ నెల చివరి వారంలో తిరుమల బ్రహ్మోత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో బస్సులను తనిఖీలు చేస్తున్నట్లు డీపీటీఓ జగదీష్ తెలిపారు. సోమవారం ఆర్టీసీ అధికారులతో కలసి అలిపిరి వద్ద బస్సులను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. ఐదు దశల్లో బస్సులను తనిఖీలు చేస్తామని, కండిషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే ఘాట్‌లో భక్తుల రాకపోకలకు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం 335 సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు, 64 విద్యుత్ బస్సులు ఘాట్‌లో తిరుగుతున్నాయని, వీటిల్లో రోజుకు 80వేల మంది భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, అలిపిరి డిపో డీఎం హరిబాబు, పలువురు మెకానిక్కులు పాల్గొన్నారు.



బస్సులను పరిశీలిస్తున్న డీపీటీఓ

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

– ఉత్సవ కమిటీల సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుమల తరహాలో తుమ్మలగుంటలో నిర్వహించే శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఉత్సవ కమిటీలతో తుడా మాజీ చైర్మన్, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలు 24వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న తరుణంలో నిర్వహణకు అన్ని విధాలా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయం ఏర్పాటైనప్పటి నుంచి తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నీ తానై ఉత్సవాలు నిర్వహించేవారని, ప్రభుత్వం ఆయన్ను అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించిన నేపథ్యంలో ఆ బాధ్యతను అందరూ పంచుకోవాలని కోరారు. ఆ భగవంతుని దయతో బ్రహ్మోత్సవాలకు ముందే బెయిల్ మంజూరు కావాలని, అలా జరగని పక్షంలో ఉత్సవాల్లో ఏలోటు లేకుండా చూసుకోవాలని కోరారు. పలువురు పార్టీ ముఖ్యనేతలు దీనిపై సానుకూలంగా స్పందించి మాట్లాడారు. సమావేశంలో ఆరు మండలాల నుంచి హాజరైన ముఖ్యనేతలందరికీ మోహిత్‌రెడ్డి బ్రహ్మోత్సవ ఆహ్వానం పలికారు. అలాగే, ఆలయ సిబ్బందితోనూ ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చెవిరెడ్డి లక్ష్మి, ఆలయ ఈఓ సుబ్బరామిరెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై శిక్షణ

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాణి ఆధ్వర్యంలో స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) పద్ధతులపై 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం తిరుపతిలోని టీటీడీ బధిర పాఠశాలలో ప్రారంభించారు. ఊహించని విపత్కర ఘటనలు ఎదురైతే వాటి నుంచి బయట పడేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందని రాణి చెప్పారు. 85మంది బధిర విద్యార్థినులకు నెలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షకుడు రత్నాకర్ తెలిపారు.



శిక్షణ పొందుతున్న బధిర పాఠశాల విద్యార్థినులు